

విజయపురం మండలం మహారాజపురంలో తవ్వుతున్న మట్టి

ఆంధ్రా మట్టిపై

తమిళ దందా

యథేచ్ఛగా రోడ్ల నిర్మాణానికి తరలింపు

వైసీపీ హయాంలో కొండలన్నీ మాయం

కూటమి ప్రభుత్వంలోనూ మారని తీరు

తిరువళ్లూరు హైవేకూ..

తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు హైవే నుంచి వేపంబట్టు, తన్నెకులం, సెవ్వాపేట మీదుగా నాలుగు లేన్ల హైవే రోడ్డు సుమారు 18 కిలోమీటర్ల నిర్మాణం చేయడానికి అనుమతి తీసుకున్నారు. 4.931 హెక్టార్లలో 98,620 క్యూబిక్ మీటర్ల మట్టి తరలించడానికి డిసెంబరు 21న జిల్లా మైనింగ్ అధికారులు అనుమతి మంజూరు చేసి ఉన్నారు. అదే తమిళనాడు పరిధిలో కొండలు, గుట్టలున్నా అక్కడ అనుమతి లేకపోవడంతో ఇక్కడి మట్టి తరలిస్తున్నారని విజయపురం మండలవాసులు వాపోతున్నారు.

విజయపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మన మట్టి అంటే అందరికీ అలుసుగా మారింది. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రా సరిహద్దు రాష్ట్రాల్లో రోడ్డు వేయాలంటే మన రాష్ట్రంలోని మట్టిని తీసుకెళుతున్నారు. ప్రధానంగా పొరుగున ఉన్న తమిళనాడులో మట్టి తీసుకునే అవకాశం ఉన్నా విజయపురం మండలం నుంచే తరలించేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయపురం మండలంలో సుమారు 10 పంచాయతీలకు తమిళనాడు సరిహద్దుగా ఉంది. ఇక్కడినుంచి చెన్నై-తిరుపతి జాతీయ రహదారికి సమీపాన వుండడంతో గ్రావెల్ వ్యాపారం జోరుగా సాగుతోంది.గాలి ముద్దుకృష్ణమ నాయుడి హయాంలో గ్రావెల్ క్వారీలపై ఉక్కుపాదం మోపారు. తమిళనాడుకు మట్టి తరలించకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో గ్రావెల్ క్వారీలు పుట్టగొడుగుల్లా విస్తరించాయి. పాతార్కాడు, మహారాజపురం, జగన్నాథపురం, జంబాడ ప్రాంతాల్లోని కొండలన్నీ మాయమై లోయలుగా మారిపోయాయి. వందల క్యూబిక్ మీటర్లకు అనుమతి పొంది వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను తరలించి భారీగా ఆర్జించేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దీనిపై విచారణకు ఆదేశించింది. అధికారులు సరైన విచారణ జరపకనే నివేదికలు ఇచ్చారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు మట్టి తరలింపు ఆగడం లేదు. ఈ విషయంలో తమిళనాడువాసులే హవా ప్రదర్శిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తమిళనాడులోని గుమ్మడిపూండి, చెన్నై నుంచి వచ్చి వ్యాపారం సాగించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంతోనూ వీరి హవానే కొనసాగుతోంది.

రోడ్లు ధ్వంసం

పెద్ద పెద్ద టిప్పర్లలో టన్నులకొద్దీ మట్టి తరలిస్తుండటంతో కోసలనగరం- కనకమ్మసత్రం రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. వాహనాల దుమ్ము ప్రభావంతో మామిడి పూత రావడం లేదని రైతులు చెబుతున్నారు.

రైతుల సంతకం ఫోర్జరీ?

గ్రావెల్ క్వారీకి అనుమతి పొందాలంటే పంచాయతీ తీర్మానంతోపాటు మేటి రైతుల సంతకం తప్పనిసరి. గ్రావెల్ క్వారీకి రెండు కిలోమీటర్ల దూరంలో గ్రామాలు, పాఠశాలలు ఉండకూడదు. ఇందుకు భిన్నంగా అధికారులు మేటి రైతుల సంతకాలు ఫోర్జరీ చేసి, సమాచారం తెలపకుండానే పంచాయతీ తీర్మానం చేసి.. రికార్డులు సృష్టించారని రైతులు ఆరోపిస్తున్నారు. క్వారీకి 700 మీటర్ల దూరంలో కాలేజీ, కిలోమీటరు దూరంలో రెండు గ్రామాలు, ఒకటిన్నర కిలోమీటరు దూరంలో మూడు గ్రామాలున్నాయని చెబుతున్నారు. 'మహారాజపురంలో గ్రావెల్ క్వారీకి సర్వే నెంబరు 1/పీ అంటూ అనుమతి మంజూరు చేశారు. తాత్కాలిక అనుమతితో ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఆ సర్వే నెంబరు ఎక్కడుందో కూడా అధికారులకు తెలియదు. సర్వే నెంబరు 177, 178లో మట్టిని తీస్తున్నారు' అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుటుంబ కలహాలకు ఇద్దరు చిన్నారుల బలి

- పిల్లలతో కలసి బావిలో దూకిన తల్లి
- తల్లిని కాపాడగలిగిన గ్రామస్తులు
- అప్పటికే పిల్లలిద్దరూ మృత్యువాత



నగరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలకు ఇద్దరు చిన్నారుల జీవితాలు బలైపోయాయి. ఆవేశంలో పిల్లల కన్నతల్లి తీసుకున్న నిర్ణయం రెండు కుటుంబాల్లో శాశ్వత విషాదాన్ని నింపింది.పోలీసుల కథనం మేరకు... నగరి మున్సిపాలిటీ పరిధిలోని భీమానగర్‌కు చెందిన దేవి (33)కి, చెన్నైలోని వెస్ట్ మాంబళానికి చెందిన ధనంజయులుతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఐశ్వర్య (10), అక్షర (3) అనే ఇద్దరు అమ్మాయిలు పుట్టారు.కుటుంబ కలహాల కారణంగా గురువారం దేవి నగరిలోని పుట్టింటికి వచ్చేసింది. శుక్రవారం ఏకాంబరకుప్పం సమీపంలో వున్న సాత్వపట్టెడలోని పెదనాన్న ఇంటికి వెళ్లి వస్తానని ఇద్దరు పిల్లలను తీసుకువెళ్లింది.ఆమె తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు సాత్వపట్టెడలోని బంధువులను విచారించారు.జాడ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.శనివారం సాయంత్రం సాత్వపట్టెడ సమీపంలోని పొలాల నుంచి ఆవులను తోలుకొస్తున్న వ్యక్తులకు అక్కడున్న బావినుంచి శబ్దాలు వినిపించాయి.బావి దగ్గరకు వెళ్లి చూడగా తాడుపట్టుకొని వేలాడుతున్న దేవి కన్పించింది.వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.



అందరూ కలసి ఆమెను పైకిలాగి ఆస్పత్రికి తరలించారు.పిల్లలకోసం గాలించి రాత్రి ఇద్దరు చిన్నారుల మృతదేహాలను బావి నుంచి బయటకు తీశారు.సీఐ మహేశ్వర్ నేతృత్వంలో పోలీసులు విచారణ చేపట్టారు.

ఇక 'పీఎంఏవై - ఎన్టీఆర్ నగర్'

- 527 జగనన్న కాలనీల పేరు మార్పు

చిత్తూరు, జనవరి11 (ఆంధ్రజ్యోతి): సొమ్ము ఒకడిది.. సోకు మరొకడిది.. అన్నట్లు వైసీపీ ప్రభుత్వ తీరు సాగింది.పేదల ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఖర్చు మొత్తాన్ని ఐదేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం అందించింది.అలా జిల్లాలో సుమారు 78వేల మందికి రూ.1.80 లక్షల చొప్పున యూనిట్ కాస్ట్‌ను కేటాయించింది. కానీ, వైసీపీ ప్రభుత్వం ఆయా పేదల కాలనీలకు మాత్రం వైఎస్సార్ జగనన్న కాలనీలుగా పేరును పెట్టుకుంది. కూటమి ప్రభుత్వం ఆ కాలనీ పేరును 'పీఎంఏవై- ఎన్టీఆర్ నగర్'గా మారుస్తూ తాజాగా ఉత్తర్వులిచ్చింది. 2020 మార్చి 20వ తేదీన అప్పటి వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలుగా పేరు పెట్టి ఉత్తర్వులను విడుదల చేయగా.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొత్త పేరు పెడుతూ శుక్రవారం ఉత్తర్వులను ఇచ్చింది. ఈ రకంగా ఉమ్మడి జిల్లాలో 527 జగనన్న లేఅవుట్ల పేరు మారనుంది.

నేడు తిరుచానూరుకు

సీఎం చంద్రబాబు

ఇళ్లకు పైప్ ద్వారా నేచరల్ గ్యాస్ సరఫరా ప్రారంభం



గ్యాస్ సరఫరాకు సంబంధించి ఓ ఇంటి వద్ద అమర్చిన మీటరు

తిరుపతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు తిరుపతి రానున్నారు. ఏజీ అండ్ పీ కంపెనీకి సంబంధించి తిరుచానూరులో ఇళ్లకు పైప్ లైన్ ద్వారా నేచరల్ గ్యాస్ సరఫరా చేసే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.ఏజీ అండ్ పీ కంపెనీగా పిలిచే అట్లాంటిక్ గల్ఫ్ అండ్ పసిఫిక్ కంపెనీ తిరుచానూరు ప్రాంతంలో ఏడాదిగా ఇళ్లకు వంట గ్యాస్‌ను పైప్‌లైన్ ద్వారా సరఫరా చేసే ప్రాజెక్టును చేపట్టింది. ఇప్పటి వరకూ వంట గ్యాస్ లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) రూపంలో సిలిండర్ల ద్వారా పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇపుడు ఏజీ అండ్ పీ కంపెనీ నేచరల్ గ్యాస్‌ను పైప్‌లైన్ ద్వారా నేరుగా ఇళ్లకు సరఫరా చేయనుంది. ఇప్పటి వరకూ సుమారు 2 వేల ఇళ్లకు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆ క్రమంలో ఆదివారం ముఖ్యమంత్రి సంబంధిత కంపెనీ ఆహ్వానం మేరకు తిరుచానూరు పంచాయతీ పరిధిలో బనియన్ ఫ్యాక్టరీ సమీపంలోని శరవణ అనే వ్యక్తికి చెందిన ఇంటిని సందర్శించి గ్యాస్ సరఫరాను ప్రారంభించనున్నారు.అనంతరం హోటల్ తాజ్‌కు చేరుకుని అక్కడ ఏజీ అండ్ పీ కంపెనీ పరిశ్రమలకు నేచరల్ గ్యాస్ సరఫరా ప్రాజెక్టును ప్రారంభిస్తారు. అలాగే అదే సంస్థకు సంబంధించిన సీఎన్‌జీతో నడిచే ద్విచక్ర, మూడు చక్రాల, నాలుగు చక్రాల వాహనాలను, ఎల్‌సీవీలను జెండా ఊపి ప్రారంభిస్తారు. ఆపై అక్కడే కంపెనీ ప్రతినిధులతోనూ, అందులో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న జపాన్ ప్రతినిధుల బృందంతోనూ సమావేశమవుతారు.

నేటినుంచీ 15 వరకూ స్వగ్రామంలోనే సీఎం

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం సాయంత్రం స్వగ్రామమైన నారావారిపల్లి చేరుకుంటారు. శనివారమే ఆయన సతీమణి నారా భువనేశ్వరి స్వగ్రామం చేరుకుని పలు అభివృద్ధి పనులు పరిశీలించడం, ప్రారంభించడం చేశారు.వీరితో పాటు నందమూరి కుటుంబానికి చెందిన పలువురు కూడా వచ్చే అవకాశముంది. ఆదివారం రాత్రి నుంచీ బుధవారం ఉదయం దాకా వీరంతా గ్రామంలోనే గడపనున్నారు. బుధవారం మధ్యాహ్నం చంద్రబాబు విజయవాడ తిరుగు ప్రయాణమవుతారు. కాగా సీఎం చంద్రబాబు నాలుగు రోజుల పాటు జిల్లాలో వుండనున్న నేపధ్యంలో యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. కలెక్టర్ వెంకటేశ్వర్, ఇంచార్జి ఎస్పీ మణికంఠ, మున్సిపల్ కమిషనర్ మౌర్య తదితరులు సీఎం పర్యటించే ప్రాంతాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అనపకాయలు కిలో రూ.వంద

సోమల, జనవరి11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో శనివారం సోమల వారపు సంతలో కూరగాయల ధరలు బాగా పలికాయి.సంక్రాంతి పండుగ వేళ ఎక్కువగా వినియోగించే అనపకాయలు కిలో రూ. 100 పలికాయి. టమోటా మాత్రం కిలో రూ.5కు చేరుకుని రైతులను నిరుత్సాహపరిచింది. కిలో మిరపకాయలు రూ.60, వంకాయలు రూ.50, బీరకాయలు రూ. 60, కాకరకాయలు రూ. 60 పలికాయి. ఇటీవల కురిసిన వర్షాలతో అనపచెట్లకు చీడపీడలు వ్యాపించి దిగుబడులు తగ్గాయి. దీంతో మార్కెట్‌లో అనపకాయలకు డిమాండ్ ఏర్పడి ధరలు పెరిగాయి.

పాపం పూలే!

ఇరువైపులా ఉన్న రాజకీయ నేతల ఫ్లెక్సీల సందులో దూరిపోతున్న వారు వడ్డెర సంఘ నేతలు. చిత్తూరులో గాంధీ విగ్రహానికి పక్కనే బీసీల ఆరాధ్య దైవం జ్యోతిరావు పూలే విగ్రహం కూడా ఉంది. శనివారం వడ్డె ఓబన్న 218వ జయంతి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వడ్డెర కులస్థులు హాజరయ్యారు. వారంతా మొదట బీసీల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించాక ర్యాలీగా నాగయ్య క్షేత్రానికి వెళ్లాలని నిర్ణయించారు.అయితే పూలే విగ్రహం వద్దకు వెళ్లడానికి దారి లేకుండా ఫ్లెక్సీలను కట్టేయడంతో వడ్డెర సంఘం నేతలు వాటి సందులో దూరి పైకి వెళ్లి పూలేకి నివాళులర్పించాల్సివచ్చింది.
- చిత్తూరు, ఆంధ్రజ్యోతి








శాస్త్రోక్తంగా చక్రస్నానం

అమ్మవారి ఆలయంలో ముగిసిన ముక్కోటి ఏకాదశి వేడుకలు

తిరుచానూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వాదశిని పురస్కరించుకుని శనివారం ఉదయం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ఆలయం నుంచి చక్రత్తాళ్వార్లను వేంచేపుగా పద్మ సరోవరంలోని(అమ్మవారి పుష్కరిణి) పంచమి తీర్థం మండపంలో కొలువుదీర్చారు. వేదమంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ చక్రత్తాళ్వార్లకు శాస్త్రోక్తంగా తిరుమంజనం నిర్వహించారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా చక్రత్తాళ్వార్‌ను అమ్మవారి పుష్కరిణిలో అర్చకులు మూడుసార్లు మునక వేయించారు. అశేష భక్తజనం పుణ్యస్నానాలు ఆచరించారు. దీంతో అమ్మవారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్, అర్చకులు బాబుస్వామి, శ్రీనివాసులు, సూపరింటెండెంట్ రమేష్‌తో సుభాస్కర్‌నాయుడు, చలపతి, బ్రహ్మానందరాజు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.45 కోట్లు



తిరుమల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.45 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించింది. రూ.2.45 కోట్లు ఆదాయం లభించినట్లు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది.

సేవాపథాన యువోత్సాహం

'కెరటం నాకు ఆదర్శం... పడుతున్నా మళ్లీ లేస్తున్నందుకు..' యువతకు మార్గనిర్దేశకుడిగా నిలిచిన స్వామి వివేకానందుడు చెప్పిన మాటలివి. రోజుకు ఒక్కసారైనా మీతో మీరు మాట్లాడుకోండి.. లేకపోతే ఓ అద్భుతమైన వ్యక్తితో మాట్లాడే అవకాశాన్ని మిస్సవుతారంటూ ఆ మహనీయుడు తరతరాలకీ తరగని స్ఫూర్తిదాయకమైన మాటలెన్నో చెప్పారు. యువతరానికి ఆయన హితవచనాలు సన్మార్గాన్ని చూపుతాయి. బంగారు భవితకు బాటలు వేస్తాయి. అందుకే వివేకానందుడి జయంతిని జాతీయ యువజనోత్సవంగా జరుపుకొంటున్నాం. ఆ మహనుభావుని మాటలతో స్ఫూర్తి పొంది ఉన్నత సమాజ నిర్మాణంలో తామూ భాగస్వాములు కావాలనే బలమైన సంకల్పంతో పనిచేస్తున్న ఈ ఇద్దరూ ఏమంటున్నారో తెలుసుకుందాం.

- గూడూరు అర్బన్ / తడ (ఆంధ్రజ్యోతి)



లేవండి..మేల్కోండి..
గమ్యం చేరేవరకూ విశ్రమించకండి
హృదయానికి, మెదడుకూ సంఘర్షణ తలెత్తితే
హృదయాన్నే అనుసరించండి
- స్వామి వివేకానంద

■ నేడు వివేకానంద జయంతి



వివేకామాట.. చూపింది బాట..

మాది రాజస్థాన్‌లోని కోట జిల్లా ముంగేనా గ్రామం. 12వ తరగతి వరకు ఇటావా లోనే విద్యాభ్యాసం గడిచింది. 2017లో భోపాల్‌లోని ఎన్ఐటీలో బీటెక్ చేశాను. రిలయన్స్ ఇండియా లిమిటెడ్‌లో మంచి జీతంతో ఉద్యోగం వచ్చింది.నా లక్ష్యానికి అది సరికాదనిపించింది. ప్రజలతో మమేకమై సేవ చేయలనే లక్ష్యం ఉండేది. ఈ కారణంతోనే కొన్నాళ్లు ఆ ఉద్యోగం చేసి వదిలేశాను. ఢిల్లీ వెళ్లి సివిల్ సర్వీసెస్ కోచింగ్‌లో చేరాను. మొదటి ప్రయత్నంలో స్టేట్ సివిల్ సర్వీస్‌కు ఎంపికయ్యాను. కానీ నాకు అది తృప్తినివ్వలేదు. అప్పుడే వివేకానందుడి స్ఫూర్తి మాటలు గుర్తుకొచ్చేవి.నాలో ఉత్సాహాన్ని రగిలించేవి.2021లో రెండవసారి ప్రయత్నించాను. 588 ర్యాంకుతో ఐపీఎస్ వచ్చింది. హైదరాబాద్‌లో శిక్షణకు జాయిన్ అయ్యాను. పోలీసుశాఖకే పరిమితం కావాలంటే మనసు అంగీకరించలేదు. వైద్యం, ఆరోగ్యం, విద్య తదితర రంగాల ద్వారా సేవచేయాలనే ఆకాంక్షకు దూరమయ్యానన్న బాధ వెంటాడేది. ఐపీఎస్ శిక్షణ పొందుతూనే మూడవ సారి సివిల్స్ రాశాను. ఈ ప్రయత్నం ఫలించింది. 343 ర్యాంకుతో ఐఏఎస్‌కు సెలెక్టయ్యాను. ఈ మూడు ప్రయత్నాల్లో నా సంకల్పానికి నాన్న, అమ్మ, తమ్ముడు, స్నేహితులు అండగా నిలిచారు. కెరీర్‌లో నేను అనుకున్న లక్ష్యాన్ని ఛేదించడంలో వివేకానందుడి మాటలు ఎంతగానో ప్రేరణగా నిలిచాయి. ఆయన తత్వం నా కెరీర్‌లో ప్రతి మెట్టునూ ప్రభావితం చేసింది. ఇప్పటివరకు సమాజం నాకు చాలా ఇచ్చింది. ఇప్పుడు సమాజానికి ఎంతో చేయాలనుంది. 'లేవండి.. మేల్కోండి... గమ్యం చేరే వరకు విశ్రమించకండి. లక్ష్యంపై ఉన్న శ్రద్ధ, ఆసక్తి లక్ష్యసాధనలో సైతం చూపించాలి.. అన్న మహనీయుడు వివేకానంద స్ఫూర్తిని నేటితరం మరువకూడదంటాను.

- రాఘువేంద్ర మీనా, ఐఏఎస్,
గూడూరు సబ్‌కలెక్టర్



యువత రాజకీయాల్లోకి రావాలి

మాది నాయుడుపేట మండలం భీమవరం సొంతూరు. మా నాన్న సుబ్రహ్మణ్యం ఎంపీగా పనిచేశారు. రాజకీయాల్లో అడుగుపెట్టి సమాజాభివృద్ధికి కృషి చేయాలనే సంకల్పం నాలో రగిలించారు. ఇదే సమయంలో వివేకానందుడి మాటలు నన్ను ఎంతగానో ప్రభావితురాలిని చేశాయి. ఆయన బ్యాంక్ అధికారిగా పనిచేసినా తరువాత రాజకీయాల్లోకి వచ్చి గ్రామాభివృద్ధికి తోడ్పడేవారు. నాకు చిన్నప్పటి నుంచి హాస్టల్‌లో ఉండి చదువుకోవడం అలవాటైపోయింది. చదువుతో ఉన్నత స్థాయికి చేరి ప్రజలకు సహాయపడవచ్చని అమ్మానాన్నా చెప్పేవారు. ఆ మాటలు ప్రభావితం చేశాయి.ఎంబీబీఎస్ చదువుతున్నప్పుడు ఐదేళ్లూ పుస్తకాలే ప్రపంచంగా బతికాను. గత ఏడాది పీజీ ఎంట్రన్స్‌కు ప్రిపేరవుతున్న దశలో అనూహ్యంగా రాజకీయాలవైపు వచ్చాను.ఆ సమయంలో చంద్రబాబునాయుడి పోరాటపటిమ, మనోనిబ్బరం నాలో స్ఫూర్తిని నింపాయి. గతేడాది ఎన్నికల్లో టీడీపీ పక్షాన పోటీ చేశాను. ఎమ్మెల్యేనయ్యాను. డాక్టర్ అంటే కొంతమందికే సేవచేసే అవకాశం ఉంటుంది. రాజకీయాల్లో అన్ని రంగాల వారికీ సేవచేసే వీలుంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో యువత రాజకీయాల్లోకి రావాలి. మెరుగైన సమాజ నిర్మాణానికి నడుం బిగించాలి. ప్రజలకు సేవచేసే అవకాశాన్ని యువతరం దూరం చేసుకోకూడదని అభిప్రాయపడుతున్నాను. ప్రతి సందర్భంలోనూ యువతరాన్ని ఉత్తేజితులను చేసి ముందుకు నడిపే వివేకానందుడి మాటలను తరచూ గుర్తు చేసుకుంటాను.

- నెలవల విజయశ్రీ, ఎమ్మెల్యే,
సూళ్లూరుపేట

ఘనంగా ట్రిపుల్ ఐటీ - శ్రీసిటీ స్నాతకోత్సవం



● 298 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం

శ్రీసిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ - శ్రీసిటీ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 298 మంది విద్యార్థులకు ఐఐటీ - శ్రీసిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఏం.వీ.కార్తికేయన్ పట్టాలను ప్రదానం చేశారు. ఐఐటీ-శ్రీసిటీ ఛైర్‌పర్సన్, జోహో కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, సీఈవో డాక్టర్ శ్రీధర్ వెంబు వర్చువల్‌గా సమావేశానికి అధ్యక్షత వహించగా, ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ ముఖ్య అతిథిగా ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఛైర్మన్ శ్రీనిరాజు, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, క్యాటర్ పిల్లర్ టెక్నాలజీ వైస్ ప్రెసిడెంట్ భువన్ ఆనంద్‌క్రిష్ణన్, ఎడబ్ల్యుఎస్ ఇండియా చీఫ్ టెక్నాలజిస్ట్ శాలినీ కపూర్ తదితర సెనేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కార్తికేయన్ 2023 - 2024 సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను సమర్పించారు. డాక్టర్ శ్రీధర్ వెంబు పట్టభద్రుల విజయాలను అభినందిస్తూ విజ్ఞాన సముపార్జన దశనుంచి సమాజానికి, దేశానికి సేవచేసే స్థితికి ఎదగాలని సూచించారు. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ తన వర్చువల్ ప్రసంగంలో మనిషి విజయం సాధించాలంటే ఆసక్తి, నిబద్ధత, ప్రావీణ్యం, సంకల్పం, ఏకాగ్రత, నేర్చుకునే సామర్థ్యం వంటి ఆరు ముఖ్య లక్షణాలు అవసరమని వివరించారు. ఐఐటీ-శ్రీసిటీ, ఇస్రో మధ్య భవిష్యత్ సహకారాలు ఉండగలవన్న ఆశాభావం వ్యక్తం చేస్తూ ఒక ఉమ్మడి పరిశోధనా విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. స్నాతకోత్సవంలో ఐదుగురికి పీహెచ్‌డీ, ఇద్దరికి ఎంఎస్, మరో ఇద్దరికి ఎంటెక్, 298 మందికి బీటెక్ పట్టాలను ప్రదానం చేశారు. బీటెక్ విభాగంలో మోహన్ సాయికృష్ణ (కంప్యూటర్ సైన్స్), దాచర్ల శ్రీజ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్) బంగారు పతకాలను అందుకున్నారు.

బాధితులకు టీటీడీ సాయం

తిరుపతి(వైద్యం), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ చేసే సమయంలో జరిగిన తొక్కిసలాటలో గాయపడి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ కోలుకున్న బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు శనివారం రాత్రి స్విమ్స్‌కు చేరుకుని చెక్కులను అందజేశారు. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం నరసాపురానికి చెందిన ఎస్.తిమ్మక్క, విశాఖపట్నంకు చెందిన పి.ఈశ్వరమ్మలకు రూ.5 లక్షల చొప్పున, స్వల్ప గాయాలైన అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం నరసాపురానికి చెందిన కె.నరసమ్మ, పి.రఘు, కె.గణేష్, పి.వెంకటేష్, చిన్నప్పయ్యలకు రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారం అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు షాజహాన్, పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, గాలి భాను ప్రకాష్, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, కలెక్టరు వెంకటేశ్వర్, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, కార్పొరేటర్ మునికృష్ణ, టీడీపీ నేతలు శ్రీధర్‌వర్మ, మోహన్‌రావు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులను అందజేస్తున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ





ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత

ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత





కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), వి.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మి (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళి, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

ఇన్‌చార్జి ఎస్పీగా మణికంఠ బాధ్యతల స్వీకరణ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా మణికంఠ శనివారం తిరుపతి ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న ఈయన్ను తిరుపతి జిల్లాకు ఇన్‌చార్జిగా నియమించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్పీగా పనిచేసిన సుబ్బరాయుడును ప్రభుత్వం హెడ్ క్వార్టర్‌కు బదిలీ చేసిన విషయం విదితమే. ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కోడిపందేలు, పేకాడితే కఠిన చర్యలు : ఎస్పీ

చిత్తూరు అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా పట్టణాలు, గ్రామాలు, శివారు ప్రాంతాల్లో కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మణికంఠ హెచ్చరించారు. పండగను కుటుంబీకులతో కలిసి జరుపుకోవాలని సూచించారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరిగితే డయల్ 100 లేదా డయల్ 112కు తెలియజేయాలని లేదంటే పోలీసు వాట్సాప్ నెంబరు 94409 00005కు సమాచారం ఇవ్వాలని కోరారు.

చిత్తూరు అర్బన్ తహసీల్దార్‌కు పదోన్నతి

చిత్తూరు రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు అర్బన్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కళావతిని పదోన్నతిపై ఒంగోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడు నెలలకు క్రితం ఈమెకు పదోన్నతి వచ్చింది. ఇన్నాళ్లు పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. కాగా చిత్తూరు అర్బన్ తహసీల్దార్ నియామకం జరగలేదని అధికారులు చెబుతున్నారు. ఈ సీటులో కూర్చోవడానికి పలువురు పోటీపడుతున్నట్లు తెలిసింది.

వరసిద్ధుడికి వెండి కిరీటం



ఐరాల(కాణిపాకం), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడికి శుక్రవారం తవణంపల్లె మండలం నత్తపుచేనుకు చెందిన యశ్వంత్ ఆయన కుటుంబీకులు కలసి వెండి కిరీటాన్ని కానుకగా అందించారు. ఈ కిరీటం కిలో బరువు కలిగి లక్ష విలువ చేయనున్నట్లు ఏఈవో రవీంద్రబాబు తెలియజేశారు. దాతను ఏఈవో ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గోవుల అక్రమ రవాణాపై వీహెచ్‌పీ నేతల ఫిర్యాదుతో ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. జీడీ నెల్లూరు నుంచి పలమనేరుకు తరలిస్తున్న ఆవుల లోడును వీహెచ్‌పీ నేతలు శనివారం పీవీకేఎన్ డిగ్రీ కళాశాల వద్ద పట్టుకున్నారు. వీహెచ్‌పీ నేత రామమూర్తి ఫిర్యాదుతో ఆవులను పలమనేరు గోశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల హక్కుల కోసం పోరాడిన ఓబన్న





ర్యాలీగా వస్తున్న వడ్డెర సంఘ నేతలు - సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతుల హక్కుల కోసం పోరాటం చేసిన యోధుడు వడ్డే ఓబన్న అని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. శనివారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో ఓబన్న జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం నుంచి కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీసీల ఆరాధ్యదైవం ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. బీసీల సంక్షేమానికి సీఎం చంద్రబాబు ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రప్ప, పూతలపట్టు బీసీ సెల్ అధ్యక్షుడు ధరణీ ప్రకాష్, యూత్ అధ్యక్షుడు హరిబాబు, సెక్రటరీ రుద్రయ్య, నేతలు మురళి, మహిళా అధ్యక్షురాలు కుసుమ, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు. ● కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాలులోనూ వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ సంక్షేమాధికారి రబ్బాని బాషా, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, బీసీ సంఘాల నేతలు షణ్ముగం, అట్టూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో మినీ గోకులాలు ప్రారంభం



చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరులో షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సెంట్రల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగను పురస్కరించుకుని జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన మినీ గోకులాలను శనివారం పలు నియోజకవర్గాల్లో ప్రజా ప్రతినిధులు పండుగ వాతావరణంలో ప్రారంభించారు. పూతలపట్టు నియోజకవర్గంలోని బంగారుపాళ్యం, యాదమరి, తవణంపల్లె మండలాల్లోని గోకులం షెడ్లను ఎమ్మెల్యే మురళీ మోహన్ ప్రారంభించారు. చిత్తూరు రూరల్‌లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, జీడీ నెల్లూరులోని పాలసముద్రం మండలంలో ఎమ్మెల్యే థామస్, పుంగనూరు నియోజకవర్గం సదుం మండలంలో టీడీపీ ఇన్‌చార్జి చల్లాబాబులు షెడ్లను ప్రారంభించారు. జిల్లాలో 2,162 గోకులాలు మంజూరవగా, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు 2,040 గ్రౌండింగ్ చేశారు. వీటిలో ఇప్పటి వరకు 244 షెడ్లు పూర్తి చేశారు. పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఏనుగు దాడిలో చెరకు పంట ధ్వంసం



ధ్వంసమైన చెరకు పంటను పరిశీలిస్తున్న అధికారులు

బంగారుపాళ్యం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని వెలుతురుచేనులో చెరకు పంటను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. గ్రామంలోని కాళెప్పకు చెందిన చెరకు తోటపై శుక్రవారం అర్ధరాత్రి పడి.. తొక్కి నాశనం చేశాయి. విషయం తెలుసుకున్న ఎఫ్ఎస్‌వో మోహన్ మురళీ తన సిబ్బంది, ట్రాకర్లతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తుల సహకారంతో డప్పులు వాయించి, బాణాసంచా పేల్చడంతో ఏనుగులు తాళ్లమడుగు అటవీప్రాంతం వైపు మళ్లాయి. అటవీ సిబ్బంది రావడంతో పంట నష్ట తీవ్రత తగ్గింది. నష్టం అంచనా వేసి పైఅధికారులకు నివేదికలు పంపనున్నట్లు ఎఫ్ఎస్‌వో తెలిపారు.

ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగులు

చిత్తూరు అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు జరిగాయి. విపత్తు నిర్వహణ సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజరుగా అనుపమ, కేఆర్ఆర్‌సీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా విజయలక్ష్మికి జిల్లాలో పోస్టింగులు ఇచ్చారు.

10 ఎర్రచందనం దుంగల స్వాధీనం

మినీ వ్యాను సీజ్, పరారైన స్మగ్లర్లు

చిత్తూరు అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పది ఎర్రచందనం దుంగలను, మినీ వ్యానును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండో పట్టణ ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. శనివారం చిత్తూరులోని ఇరువారం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. పోలీసులకు కొద్ది దూరంలోనే మినీ వ్యానును ఆపేసి కొందరు పరారయ్యారు. వాహనాన్ని తనిఖీ చేయగా పది ఎర్రచందనం దుంగలు కనిపించాయి. దీంతో వాహనంతోపాటు దుంగలను సీజ్ చేశారు. పరారైన స్మగ్లర్లను పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో

నేడు సంక్రాంతి వేడుకలు

చిత్తూరు సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల సంఘం, ఎంవీ కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరగనున్నాయి. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో నిర్వాహకులు మీడియాతో మాట్లాడారు. స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు సంబరాలు మొదలవుతాయని చెప్పారు. కవులు, రచయితలు, కళాకారులు, గాయకులు, వివిధ రంగాల్లో సేవలు అందించిన సుమారు 200 మందికి ప్రముఖుల ద్వారా సన్మానం జరుగుతుందన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంవీ శ్రీధర్ రెడ్డి, రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు గిరిధర్, సహదేవ నాయుడు, పాడి రమేష్ బాబు, కృష్ణంరాజు, పాడి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నారావారిపల్లెలో భువనేశ్వరి



ఏటీఎంను ప్రారంభించిన భువనేశ్వరి

చంద్రగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శనివారం మధ్యాహ్నం నారావారిపల్లెకు చేరుకున్నారు. ఆదివారం రాత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఆయన సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్, ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ, భార్య వసుంధర రానున్నారు. నారా, నందమూరి కుటుంబాలు ఏటా సంక్రాంతికి చంద్రబాబు స్వగ్రామమైన నారావారిపల్లెకు రావడం ఆనవాయితీ. ఈ క్రమంలో గ్రామం రెండు రోజులు ముందుగానే సంక్రాంతి శోభను సంతరించుకుంది. తెలుగు తమ్ముళ్లు పండుగ ఏర్పాట్లు చేస్తున్నారు. చంద్రబాబు ఇంటి వద్ద, తల్లితండ్రుల సమాధుల వద్ద, కులదైవం నాగాలమ్మ ఆలయం, గ్రామ దేవతల వద్ద పరిసరాలను శుభ్రం చేశారు. ఎన్టీఆర్, ఆయన సతీమణి బసవతారకం విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. సందర్శకులను దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు.

నారావారిపల్లె ప్రజల సౌకర్యార్థం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంను నారా భువనేశ్వరి ప్రారంభించారు. ఏటీఎం ద్వారా నగదు లావాదేవీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, డీపీవో సుశీలాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చిరుతలు రోడ్డెందుకు దాటుతున్నాయి?



ఎస్వీయూలో ఏర్పాటైన హెచ్చరిక బోర్డులు

ఏడాదిన్నర కిందట అలిపిరి నడక దారిలో మూడు నెలల వ్యవధిలో ఇద్దరు చిన్నారులపై చిరుతలు రాత్రిపూట దాడి చేసిన ఘటన అందరికీ గుర్తుండే వుంటుంది. ఇపుడు ఏకంగా అలిపిరి-చెర్లోపల్లి ప్రధాన రహదారిలో పట్టపగలు ఓ వ్యక్తిపై చిరుత దాడి చేసినంత పని చేసింది. ఎవరి కంటా పడడం ఇష్టపడని జంతువుగా చిరుతకు పేరుంది. అలాంటిది మిట్ట మధ్యాహ్నం పూట అందులోనూ నగరం నుంచీ అడవిలోకి వెళ్ళేందుకు ప్రధాన రహదారి దాటుతూ చిరుత కనిపించడం కలకలం రేపుతోంది. అసలు చిరుత పగటి వేళ శేషాచలం వదిలి అలిపిరి రోడ్డుదాటి మరీ నగరంలోకి ఎందుకు వచ్చింది? అడవి విడిచిపెట్టి వచ్చేంతగా తిరుపతిలో చిరుతలను ఆకర్షిస్తున్నది ఏముంది? అన్న ప్రశ్నలు ఈ సందర్భంగా తలెత్తుతున్నాయి.


- అటవీ ప్రాంతంతో కలగలసిపోయిన వర్శిటీలు
- అలిపిరి-చెర్లోపల్లి మార్గంలో హోటళ్లు, హాస్టళ్లు
- వాటినుంచి వచ్చే వ్యర్థాల చుట్టూ చేరుతున్న కుక్కలు, జింకలు, అడవి పందులు
- చిరుతలను ఆకర్షిస్తున్న ఫుడ్ చెయిన్



తిరుపతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):ప్రకృతిలో జీవి మనుగడకు ఆధారమైంది ఆహారపు గొలుసు. ఇపుడదే ఆహారపు గొలుసు చిరుతలను శేషాచలం నుంచీ తిరుపతి నగరంలోకి రప్పిస్తోంది. తిరుపతిని శేషాచల అడవుల నుంచీ విడదీసేందుకు ప్రత్యేకంగా ఎలాంటి కంచెలు, ప్రహరీలు లేవు. ఎస్వీ యూనివర్శిటీ మొదలుకుని అనేక విద్యా సంస్థల ఆవరణలు శేషాచల అటవీ ప్రాంతంతో కలసిపోయి వున్నాయి. కేవలం అలిపిరి-చెర్లోపల్లి మెయిన్ రోడ్డు ఒక్కటే వాటిని విడదీస్తోంది. అయితే రాకపోకలను ఆపే సరిహద్దు కాదది. ఒకరకంగా చెప్పాలంటే అడవి నుంచీ జంతువుల రాకపోకలను ఈ రోడ్డు మరింత సులువు చేస్తోంది. ఎస్వీయూ, వేదిక్, వెటర్నరీ వర్శిటీలు, అగ్రికల్చర్ కాలేజీలలో హాస్టళ్ళు వున్నాయి. వాటి ద్వారా రోజువారీ భారీగా వ్యర్థాలు ఆవరణల్లో పోగుపడుతున్నాయి. మరోవైపు అలిపిరి-చెర్లోపల్లి ప్రధాన మార్గం వెంబడీ పలు హోటళ్ళు, కేఫ్‌లు వెలిశాయి. వీటి నుంచీ కూడా పెద్దఎత్తున వ్యర్థాలు పోగు పడుతున్నాయి. ఈ వ్యర్థాల కోసం కుక్కలు, జింకలు, అడవి పందులు యధేచ్ఛగా వస్తున్నాయి. వర్శిటీల ఆవరణల్లో పగలు కూడా జింకలు, అడవి పందులు పెద్ద సంఖ్యలో తిరుగాడుతూ కనిపిస్తున్నాయి. ఇక కుక్కలైతే మందలుమందలుగా తిరుగుతున్నాయి. ఈ మూడింటి కోసం చిరుతలు శేషాచలం నుంచీ రోడ్డు దాటి ఈ వర్శిటీల వైపు వస్తున్నాయి. శేషాచల దిగువ భాగాన వున్న ఎస్వీయూ సహా పలు విద్యా సంస్థల ఆవరణల్లోకి చిరుతలు రావడం కొత్త కాదు. పై జంతువుల కోసం రెండు దశాబ్దాలుగా చిరుతల రాకపోకలు సాగుతున్నాయి. అయితే గతంలో ఎప్పుడూ రాత్రిళ్ళు మాత్రమే ఎవరి కంటా పడకుండా అడవి దాటి వర్శిటీల ఆవరణల్లోకి వచ్చే చిరుతలు ఇపుడు ఏకంగా పగలే చొరబడుతున్నాయి. అలిపిరి నడక దారిలో చిన్నారులపై దాడి జరిగినట్టు వర్శిటీల ఆవరణల్లోనూ, అలిపిరి-చెర్లోపల్లి రోడ్డులోనూ ఇప్పటి దాకా ఎలాంటి ఘటనలూ నమోదు కాలేదు కానీ ఇకమీదట జరగబోవన్న గ్యారంటీ ఏమీ లేదు. ఇప్పటికే అటవీ శాఖ అధికారులు అమర్చిన కెమెరా ట్రాపుల్లో చిరుతల రాకపోకలు, కుక్కలను నోటకరుచుకుని వెళుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. విద్యార్థులు కూడా తమ మొబైళ్ళలో చిరుతల కదలికలను చిత్రీకరించిన ఉదంతాలున్నాయి.

తక్షణ చర్యలు తీసుకోకుంటే ప్రమాదమే!

శేషాచల అడవుల్లో చిరుతలు సుమారు 50కి పైగా వుంటాయని అంచనా. అడవిలో వాటి సంఖ్య పెరిగే కొద్దీ సులువుగా దొరికే ఆహారం కోసం అడవి దాటి బయటకు రావడం కూడా పెరుగుతోంది. అడవిలో అయితే జింకలు, అడవిపందులు వంటి వాటిని వెంటాడి వేటాడాలి. అదే అలిపిరి-చెర్లోపల్లి రోడ్డు దాటి దక్షిణానికి వస్తే విద్యాసంస్థల ఆవరణల్లో కుక్కలు, జింకలు, అడవి పందులు సులువుగా దొరికే అవకాశముంది. అందుకే ఈ వైపు చిరుతల కదలికలు క్రమేపీ పెరుగుతున్నాయి. అలిపిరి-చెర్లోపల్లి రోడ్డు వెంబడీ హోటళ్ళు, కేఫ్‌లకు అనుమతి రద్దు చేయడం, లేదా కనీసం వారు వ్యర్థాలను దూరంగా పారబోసేలా చర్యలు తీసుకోవాల్సి వుంది. వర్శిటీల హాస్టళ్ళ నుంచీ వచ్చే వ్యర్థాలు ఆవరణలో పడేయకుండా చూడాలి. వర్శిటీల ఆవరణల్లో రోజూ ఉదయం, సాయంత్రం వాకింగ్ కోసం వచ్చే వారు కూడా వ్యర్థాలు పడేస్తున్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగా కుక్కలకు పెడుతున్నారు. దీంతో కుక్కల సంఖ్య పెరుగుతోంది. వ్యర్థాలు ఆవరణలో పడేయకుండా నివారిస్తే చిరుతల రాకపోకలు కూడా ఆగిపోతాయని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. చిరుతలు మనుషులపై దాడి చేసే వరకూ ఆగకుండా ఆ దిశగా చర్యలు తక్షణావసరం.



ఈనెల 3న ఎస్వీయూలో చిరుత సంచారం

ఎస్వీయూలో ట్రాప్ కెమెరాలు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

తిరుపతి (విశ్వవిద్యాయాలు), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పులి వస్తుంది.. జాగ్రత్త అంటూ ఎస్వీయూలో పలు చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటయ్యాయి. ఇటీవల చిరుత సంచారం నేపథ్యంలో విద్యార్థులను, ఉద్యోగులను అప్రమత్తం చేస్తూ ఈ బోర్డులు ఏర్పాటయ్యాయి. సాయంత్రం 6 నుంచీ ఉదయం 6 గంటల వరకూ ఎవరూ యూనివర్సిటీలో సంచరించకూడదంటూ ఇందులో అధికారులు సూచించారు. అయితే, ఈ నెల 3 వ తేదీన యూనివర్సిటీలో చిరుత సంచరించినట్టు ఫారెస్టు అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో రికార్డు అయినట్టు సమాచారం. దీంతో, యూనివర్శిటీలో చిరుత పులి ట్రాప్ బోన్లను కూడా ఏర్పాటు చేయాలని యూనివర్సిటీ అధికారులు ఫారెస్టు అధికారులను కోరారు.పులి సంచారం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు విజ్ఞప్తి చేశారు.

జాగ్రత్తలు తీసుకుంటున్నాం

మంగళం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చిరుత దాడికి ప్రయత్నించడంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న టీటీడీ ఉద్యోగి మునికుమార్ కిందపడి గాయాలపాలైన నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.చెర్లోపల్లి రోడ్డులోని వేదిక్ వర్సిటీ వద్ద చెట్టుపై నుంచి చిరుత ఒక్కసారిగా కిందకు దూకడంతో భయపడిన మునికుమార్ వాహనం నుంచి కిందపడ్డాడు. ఈ నేపథ్యంలో చెర్లోపల్లి రోడ్డులో సాయంత్రం 6నుంచి ఉదయం 6 గంటల వరకు ఎవరూ తిరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. చిరుత వేద విశ్వవిద్యాలయం నుంచి శేషాచల కొండల్లోకి వెళ్లే సమయంలో ఈ సంఘటన జరిగిందని అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. చిరుత సంచరించే మార్గంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా సిబ్బందికి నైట్ డ్యూటీలు వేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారు బోను ఏర్పాటు చేస్తామని చెప్పారన్నారు. చిరుతలను ఎవరైనా గమనించినట్లయితే వెంటనే అటవీ శాఖ ఎఫ్‌బీవో 9440090809, ఎఫ్ఎస్‌వో 9492549171, ఎఫ్ఆర్‌వో 9440810303 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలల్లోనే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని.. కుప్పం నియోజవర్గ ప్రజానీకానికి వందల కోట్ల వరాలు దక్కాయని.. ముఖ్యమంత్రి చంద్రబాబు బాధిత పేదల పక్షం వహిస్తారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం మండల సచివాలయంలో శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా 145 మంది బాధితులకు రూ.2.93 కోట్లు విలువగల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఎప్పుడూ చంద్రబాబుకు రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరాజు, టీడీపీ కుప్పం మున్సిపల్, మండల అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, శాంతిపురం, రామకుప్పం మండల పార్టీ అధ్యక్షులు విశ్వనాథనాయుడు, ఆనందరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ప్రదీప్‌బెహ్రా

రామకుప్పం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధ్యక్షుడు ప్రదీప్‌బెహ్రా, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి శివరాయల్ తెలిపారు. భారత యువజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శనివారం రామకుప్పం అంబేడ్కర్ గురుకుల విద్యాలయం క్రీడామైదానంలో వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసి జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేలా చూసేందుకే ప్రధాని మోదీ ఎన్‌వైకే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రాజసింహ, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, జనసేన మండల అధ్యక్షుడు హరీష్, బీజేపీ నేతలు రఘునాథ్, గజేంద్రరెడ్డి, అప్పస్వామి, ఆనంద్, నాగరాజు, ఏకాంత, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి



ఆర్థిక సాయం అందుకుంటున్న బాధిత కుటుంబ సభ్యులు

శాంతిపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం నక్కనపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త కార్తీక్ కుమారుడు హన్విష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. హన్విష్‌ను బతికించుకునేందుకు వివిధ ఆసుపత్రుల్లో కార్తీక్ అప్పులు చేసి ఖర్చు చేశాడు. అయినా హన్విష్ కోలుకోలేక మృత్యువాతపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నపుడు కార్తీక్ సీఎం సహాయనిధి నుంచి ఆర్థికసాయం కోసం సీఎంకు వినతిపత్రం అందించాడు. దీంతో సీఎం చంద్రబాబునాయుడు రూ.3.64 లక్షలు ఆర్థికసాయం మంజూరు చేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హన్విష్ మృతి వార్త తెలుసుకుని నక్కనపల్లెకు చేరుకుని మృతుడికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి సీఎం సహాయనిధి చెక్కును అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, సర్పంచి విజయరామిరెడ్డి, నేతలు చంద్రశేఖర్, ఆంజనేయరెడ్డి, చంద్రారెడ్డి, రమేష్, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

పాడిపరిశ్రమ అభివృద్ధికి కృషి



మణీంద్రంలో మినిగోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాడిపరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్ అన్నారు. శనివారం మండల పరిధి మణీంద్రం, పీఎంకేతాండాల్లో గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పాడిరైతులను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం మొదటి విడతగా ప్రతి నియోజకవర్గానికి 250 గోకులం షెడ్లను మంజూరు చేసిందన్నారు. సీఎం చంద్రబాబు కుప్పం నియోజకవర్గానికి రెట్టింపు సంఖ్యలో 500 షెడ్లను మంజూరు చేశారన్నారు. కార్యక్రమాల్లో ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో రవికుమార్, నేతలు వెంకటరమణ, రామలింగారెడ్డి, మంజునాథరెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి, భానుమూర్తి, శ్రీరాములురెడ్డి, చిరంజీవి, మునిరాజునాయక్, సుధాకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యాచకురాలి మృతి



మృతి చెందిన మహిళ

పుంగనూరు రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అనుమానస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన శనివారం పుంగనూరులో ఆలస్యంగా వెలుగు చూసింది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. పట్టణంలోని ఆంజనేయస్వామి గుడి వీధిలో కుమారమ్మ(65) ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పట్టణంలో వివిధ ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుని జీవనం సాగిస్తుండేది. వారం రోజుల నుంచి కుమారమ్మ బయట కనబడకపోవడం.. ఇంట్లో వస్తున్న దుర్వాసనతో ఇంటి యజమాని రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆమె మృతికి గల కారణాలపై ఆరా తీశారు. మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం - ఒకరి అరెస్టు



బైరెడ్డిపల్లె, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తయిండ్లు బస్టాపు వద్ద శనివారం ఉదయం కర్ణాటక మద్యాన్ని అమ్ముతున్న కృష్ణప్పను అరెస్టుచేశారు. అతడి నుంచి 50 మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు బైరెడ్డిపల్లె పోలీసులు తెలిపారు. మండలంలో ఎక్కడైనా అక్రమంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

చల్లా రామచంద్రారెడ్డికి సత్కారం



చల్లా రామచంద్రారెడ్డిని సత్కరించిన బండకిందపల్లె వాసులు

రొంపిచెర్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్లలోని చల్లా రామచంద్రారెడ్డిని ఆయన ఇంటి వద్ద బండకిందపల్లెకు చెందిన మైనార్టీలు, టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భగా ఆయన్ను శాలువతో సన్మానించి జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న రహదారులు, మురుగునీటి కాలువల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ నాయకులు మదనమోహన్‌రెడ్డి, అలీసాహెబ్, ఇర్ఫాన్, సర్పంచ్ ఎస్.అన్వర్‌బాష, చంద్రారెడ్డి, స్వామిరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం విజయవంతం



కంటిని పరీక్షిస్తున్న వైద్యులు

కుప్పం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పీఈఎస్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. మొత్తం 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 20 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు లయన్స్ క్లబ్ అడ్వైజర్ ఎ.మహేశ్ తెలిపారు. వైద్య సేవలో పాల్గొన్నవారికి లయన్స్ క్లబ్ సభ్యులు వీజీ.సెల్వం కుటుంబ సభ్యులు భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి చరణ్, సభ్యులు వీజీ.సెల్వం, శివ, కృష్ణమూర్తి, కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటరమణ

సోమల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని విశ్రాంత బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి మునివెంకటప్ప తెలిపారు. శనివారం స్థానిక హైస్కూల్ ఆవరణలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సీజన్-9 శివాలయం రాయల్స్ ఆధ్వర్యంలో సుమన్ టీవీ ప్రతినిధులు రూ.50 వేలు ప్రోత్సాహక బహుమతులు ప్రకటించడంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం హరినాథ్, మాజీ సర్పంచి శ్రీరాములు, ఎంపీటీసీ సావిత్రమ్మ, వీవీ. రమణ, విశ్రాంత ఎల్ఐ. వెంకటరమణ, కామిశెట్టి నగేశ్, సోమశేఖర్, మంజునాథ్, జగన్, జగదీశ్, దామోదరం, సునిల్, అభిషేక్, వినోద్‌కుమార్, శివశంకర్, మహేంద్రబాబు, జ్యోతీశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

సోమల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సోమల ఎస్ఐ శివశంకర్ తెలిపారు. అలాగే సంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. యువత అసాంఘిక చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

కూర్నిపల్లె-వి.రామాపురం రోడ్డు పనుల ప్రారంభం



తారురోడ్డు పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

గంగవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రోడ్డుకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చొరవతో మోక్షం లభించింది. మండలంలోని కూర్నిపల్లె - వి.రామాపురం గ్రామానికి మూడు కిలోమీటర్లు ఉండగా.. 2 కిలోమీటర్లు మాత్రమే తారురోడ్డును గతంలో ఏర్పాటుచేశారు. మిగిలిన ఓ కిలోమీటరు రోడ్డు వేయకపోవడంతో గుంతలమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎన్నికల ముందు కూర్నిపల్లె, వి.రామాపురం గ్రామాలకు ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి గ్రామస్థులు సమస్యను విన్నవించారు. అప్పట్లో ఇచ్చిన హామీ మేరకు కూర్నిపల్లె నుంచి వి.రామాపురం గ్రామానికి పెండింగ్‌లో ఉన్న కిలోమీటరు రోడ్డుకు రూ.77 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఆ నిధులతో శనివారం టీడీపీ నాయకులు భూమి పూజ చేసి తారు రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి ప్రసాద్‌నాయుడు, గోవిందస్వామి నాయుడు, విజయకుమార్, చంద్రప్ప, వెంకటేష్, శీన, వెంకటప్ప తదితర నాయకులు పాల్గొన్నారు.

కృష్ణయ్యను కలిసిన పుంగనూరు బీసీ నేతలు



కృష్ణయ్యను కలిసిన పుంగనూరు బీసీ సంఘ నాయకులు

పుంగనూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కృష్ణయ్యను పుంగనూరు బీసీ సంఘ నేతలు మర్యాద పూర్వకంగా కలిసినట్లు చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి తెలిపారు. శనివారం తిరుపతి ఎస్ఎస్‌బీ కల్యాణ మండపంలో ఆయనతో కలిసి జిల్లా నూతన కమిటీ నియామక పత్రాలను అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటకృష్ణ, జ్యోతినాథ్, నూకనమ్మ, శేషు, లక్ష్మీప్రసన్నకుమార్, అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



కుప్పం సంబరాలలో బీసీ నాగరాజ్ తదితరులు



రామకుప్పంలో చిన్నారుల నృత్యం



వి.కోటలో సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు



ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు



బైరెడ్డిపల్లె: బహుమతులందుకున్న విజేతలు

కుప్పం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బీసీఎన్ విద్యా సంస్థల అనుబంధమైన కుప్పం డిగ్రీ కళాశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించారు. సంస్కృతి, సంప్రాయాలు ఉట్టిపడే కట్టుబొట్టులో ఉన్న ప్రముఖులు, అధ్యాపకులు, విద్యార్థులతో కళాశాల ప్రాంగణం కళకళలాడింది. బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ నాగరాజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి భోగి, సంక్రాంతి, కనుమ పండుగల గురించి వివరించారు. సంబరాల సందర్భంగా గోమాతను పూజించారు. ఉట్టి కొట్టడం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●రామకుప్పం: రామకుప్పం మండలం నెర్నిల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణతో భోగి మంటలు వేసి తల్లిదండ్రులతో పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో రంగవల్లులు వేసి, గొబ్బెమ్మలు ప్రతిష్ఠించారు. అంగన్‌వాడీ కార్యకర్త శారద, గ్రామస్తులు పాల్గొన్నారు.

●బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో శనివారం కళాతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హెచ్ఎం చైతన్యాచారి, కడపనత్తం సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు మంజునాథగౌడు, సీఆర్పీలు రామచంద్ర, వెంకటరమణ, స్వచ్ఛభారత్ ఎంసీవో సురేష్‌బాబు, సంధ్య, అఫ్సానా, నిర్వాహకులు మురళీధర్, శ్రీనివాసులు, రాజేంద్ర, గోపి, రాజన్న, రాజగోపాల్ పాల్గొన్నారు.

●వి.కోట: వి.కోట నలంద కళాశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణతో రంగవల్లులు వేసి, గొబ్బెమ్మలు ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీటీడీలో ప్రక్షాళన అవసరం: బీసీవై



బాధితులతో మాట్లాడుతున్న బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్

పుంగనూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో ప్రక్షాళన చేయాలని బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన, దైవభక్తి, పరిపాలన అనుభవం కలిగిన వారికి టీటీడీలో అవకాశాలు కల్పించాల్సి ఉందన్నారు. రాజకీయ నాయకులు, కార్పొరేటర్లకు అవకాశం కల్పించడంతో దారుణాలు జరుగుతూనే ఉంటాయన్నారు. ప్రస్తుతం ఉన్న పాలక మండలిని వెంటనే రద్దు చేయాలని డిమాండు చేశారు. వైసీపీ పాలనలో ఉన్న పాలకమండలి సభ్యులను మళ్లీ కూటమి ప్రభుత్వం నియమించడం సరికాదన్నారు. తిరుమల- తిరుపతిలో జరిగిన తొక్కిసలాటకు పూర్తి బాధ్యతను ప్రస్తుతం ఉన్న పాలకమండలి తీసుకోవాల్సి ఉందన్నారు. బోర్డు సభ్యులుగా ఉండాలంటే డిక్లరేషన్ తీసుకోవాలని, టీటీడీ పాలక మండలిలో సభ్యులుగా ఉండాలంటే తిరుపతిలోనే కాపురం ఉండాలన్నారు. ఈ విషయాలపై సీఎం చంద్రబాబునాయుడుకు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు.

21 మందికి సీఎం సహాయనిధి సాయం



చెక్కులు అందజేస్తున్న పీఎస్ఎం, ఆనందరెడ్డి

రామకుప్పం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో వివిధ రోగాల బారిన పడి చికిత్సలు పొందిన 21 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధితో రూ. 36.52 లక్షల ఆర్థికసాయం మంజూరైనట్లు టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, నేతలు చలపతి, కొళ్లపల్లె బాబు, బాలరాజు, మురళీమోహన్, సుబ్రీ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నృత్య పోటీలు



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న హిందూ సత్యధర్మ దివ్యజ్ఞాన జ్యోతి ప్రతినిధులు

పుంగనూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వివేకానంద జయంతి సందర్భంగా విద్యార్థులకు నృత్యాల పోటీలు నిర్వహించినట్లు హిందూ సత్యధర్మ దివ్యజ్ఞాన జ్యోతి ప్రతినిధులు తెలిపారు. శనివారం జమీందార్ ప్యాలెస్ సమీపంలోని త్యాగరాజస్వామి కళాక్షేత్రంలో సంప్రదాయ నృత్యాలు నిర్వహించారు. మన దేశ సంప్రదాయాలు, సంస్కృతిపై విద్యార్థులకు తెలియజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హిందూ సత్యధర్మ దివ్యజ్ఞాన జ్యోతి ప్రతినిధులు వెంకటేశ్వర్లు, నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పలమనేరులో ఫంక్షన్ హాల్



పలమనేరులో ఫంక్షన్ హాల్ నిర్మించనున్న స్థలం

పలమనేరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో ఎట్టకేలకు రూ.5 కోట్లతో ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సంబంధించి డీపీఆర్‌ను ప్రభుత్వానికి పంపినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.వి.రమణారెడ్డి తెలిపారు. 2019 ఫిబ్రవరిలో స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పరిశ్రమలశాఖ మంత్రిగా ఉన్నప్పుడు స్థానికుల అభ్యర్థన మేరకు కళామందిరం నిర్మాణానికి మత్స్యశాఖకు చెందిన దాదాపు 80 సెంట్ల స్థలాన్ని తీసుకొని అందులో కళామందిరం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావడంతో పాటు అమరనాథరెడ్డి ఓటమి చెందారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కళామందిరం నిర్మాణం గురించి పట్టించుకోక పోగా అత్యంత విలువైన ఈ స్థలంలో వాణిజ్య సముదాయం నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధ చేశారు. అయితే 2024 లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో పాటు గత ఎన్నికల్లో ఓటమి చెందిన అమరనాథరెడ్డి మళ్లీ ఇక్కడ ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఐదేళ్ల క్రితం తాను కళామందిరం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన స్థలంలో మళ్లీ ఫంక్షన్ హాల్, డైనింగ్ హాల్, పార్కింగ్ కోసం సెల్లార్, మరో వైపు 12 గదులతో షాపింగ్ నిర్మాణానికి రూ.5 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేయించి ప్రభుత్వానికి పంపారు. ఇప్పటికే మున్సిపల్ ఖాతాలో ఆనాడు మంజూరు చేయించిన రూ.1.8 కోట్లు ఉన్నందున మిగిలిన మొత్తం ప్రభుత్వం నుంచి వస్తే సరిపోతుందని అధికారులు అంటున్నారు. నిధులతో పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఏడాదిన్నర లోపు ఈ భారీ ఫంక్షన్ హాల్ వాణిజ్య సముదాయం నిర్మాణాలు పూర్తిచేయొచ్చని అధికారులు అంటున్నారు. నిర్మాణాలు పూర్తయితే మున్సిపాలిటీకి మరింత ఆదాయం వస్తుందని అధికారులు అంటున్నారు.

నాటుసారా ఊట ధ్వంసం



సారా ఊటను ధ్వంసం చేసిన ఎక్సైజ్‌శాఖ పోలీసులు

పుంగనూరు రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం పరిధిలోని వ్యవసాయ పొలాల్లో దాడులు నిర్వహించి 2100 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ సురేశ్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పెద్దతాండా, జువ్వలదిన్నె తాండా గ్రామాల వ్యవసాయ పొలాల్లో తన సిబ్బందితో దాడులు నిర్వహించగా నాటు సారా తయారీకి నిల్వ ఉంచిన బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దాడుల్లో ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుష్ప పల్లకిలో ఊరేగిన సీతారాములు



పుష్ప పల్లకిలో ఊరేగింపుగా సీతారాములు

చౌడేపల్లె, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారామ స్వాములు పుష్పపల్లకిలో వైభవంగా ఊరేగారు. శనివారం స్థానిక బస్టాండులో వెలసిన కమలాంజనేయ స్వామి, సీతారామ లక్ష్మణాంజనేయస్వాములకు ఆలయ అర్చకులు వశిష్టాచార్యులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పుష్పపల్లకిలో పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో మాణిక్య వరదరాజస్వామి



పుంగనూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నగిరిప్యాలెస్ సమీపంలో వెలసిన మాణిక్య వరదరాజ స్వామి శనివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కళ్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో జరిగిన వైకుంఠ ఏకాదశి తర్వాత రోజున మాణిక్య వరదరాజస్వామి ఆలయంలో వైకుంఠ ద్వారం ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తున్నట్లు అర్చకులు తెలిపారు. ఆలయ అర్చకులు ఉదయాన్నే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

శనీశ్వరాలయంలో పూజలు

బైరెడ్డిపల్లె, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగినేపల్లె శనీశ్వరాలయంలో శనివారం శనిత్రయోదశి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బాలిక అదృశ్యం

పుంగనూరు రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యం కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. పట్టణానికి సమీపంలోని నక్కబండకు చెందిన ఓ బాలిక(16) శనివారం ఉదయం నుంచి కనిపించడం లేదు. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి



ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వడ్డెర కులస్తులు, టీడీపీ నాయకులు

కుప్పం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రథమ స్వాతంత్ర్య సమర యోధుడైన ఉయ్యాలవాడి నరసింహారెడ్డి అనుచరుడు, స్వాతంత్ర యోధుడు వడ్డే ఓబన్న 218వ జయంతిని కుప్పంలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి రవి, నాయకులు గోపీనాథ్, వడ్డే కుల సంఘం అధ్యక్షుడు మాధవన్, బాలు, కేవీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

●పుంగనూరు రూరల్: పుంగనూరులో వడ్డెర ఓబన్న జయంతి వేడుకలను వడ్డెర కులస్తులు, టీడీపీ నాయకులు కలసి ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వడ్డెర కులస్తులు గంగులప్ప, గంగాధర్, సుబ్రహ్మణ్యం, బాలాజీ, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి, పోలీసుగిరి, శమీపతి, వెంకటరెడ్డి, ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

●వి.కోట: వడ్డె ఓబన్న జయంతిని వి.కోటలో ప్రజాప్రతినిధులు, నేతలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్, అంబేడ్కర్ సర్కిల్‌లో ఓబన్న చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, నేతలు పవన్‌కల్యాణ్, పునీత్, గోవిందస్వామి, బాలు, చలపతి, రామకృష్ణ పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వడ్డే ఓబన్న స్ఫూర్తిని కొనసాగించాలి: టీడీపీ



వడ్డే ఓబన్న చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

చిత్తూరు సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వడ్డే ఓబన్న స్ఫూర్తిని కొనసాగించాలని టీడీపీ నేతలు పిలుపునిచ్చారు. శనివారం ఓబన్న జయంతి సందర్భంగా జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. నేతలు మాట్లాడుతూ.. ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో సీఎం చంద్రబాబు.. బీసీల సంక్షేమానికి కృషిచేస్తున్నారని చెప్పారు. చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, కలికిరి మురళీ మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు కోదండయాదవ్, మోహన్ రాజ్, చిట్టిబాబు, లక్ష్మీప్రసన్న, ధరణి ప్రకాష్, విజయ్ కుమార్, గోపాల్, శంకర్, రవీందర్ రాజు, గుణశేఖర్, మురళి, మణికంఠ బాబు, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: వడ్డే ఓబన్న జయంతిని తూంపాయనపల్లెలో వడ్డెర విజయభేరి అధ్యక్షుడు బండా రామచంద్ర ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బండా నాగరాజ, వెంకటస్వామి, నక్కా మహేష్, వెంకటాచలం, గిరిబాబు, ముని వెంకటయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం/ఎమ్మెల్యే జగన్మోహన్



పశుమందలో మినీ గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. పశుమంద, క్రిష్ణజిమ్మాపురంలో గోకులం షెడ్లను శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు అండగా తమ ప్రభుత్వం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఎంపీటీసీ విజయలక్ష్మి, మాజీ జడ్పీటీసీ బాలాజి నాయుడు, మాజీ ఎంపీపీ దీపశ్రీ, టీడీపీ నాయకులు అనిల్‌కుమార్, సాంబశివ నాయుడు, నాగరాజ్ యాదవ్, బాబు, హరి, రఘునాథ నాయుడు, ప్రతాప్, జయదేవ నాయుడు, బలరామ్, శరత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్: ముత్తుకూరులో మినీ గోకులం షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. టీడీపీ నాయకులు జయచంద్రనాయుడు, మోహన్‌రాజ్, శశికర్‌బాబు, మేషాక్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ చేసి.. దాచుకున్న డబ్బును పంచిపెట్టు
మాజీ సీఎం జగన్‌కు ప్రభుత్వ విప్ థామస్ సూచన

గంగాధరనెల్లూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో దోపిడీ చేసి, దాచుకున్న డబ్బును తిరుపతి ఘటనలో మృతి చెందిన, ఆస్పత్రి పాలైన బాధితుల కుటుంబాలకు మాజీ సీఎం జగన్‌రెడ్డి పంచిపెట్టాలని ప్రభుత్వ విప్ వీఎం థామస్ సూచించారు. మాతృవియోగం కల్గిన నెల్లేపల్లె పంచాయతీ చిన్నమిట్టపల్లెలో మాజీ వైస్ సర్పంచ్, టీడీపీ సీనియర్ నేత వెంకటపతిరెడ్డిని శనివారం సాయంత్రం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తిరుపతి ఘటనపై ఇప్పటికే అధికారులపై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా టీటీడీకి సీఎం చంద్రబాబు తగిన ఆదేశాలిచ్చారని చెప్పారు. ఇక జగన్ మాత్రం ఆస్పత్రికి బాధితులను పరామర్శించడానికి కాకుండా జాతరకు వచ్చినట్లుగా జేజేలు కొట్టించుకున్నారని మండిపడ్డారు. నాయకులు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, వెంకటేష్, శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఆర్ రాజన్ జన్మదిన వేడుకలు



సీఆర్ రాజన్‌కు కేకు తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, హాజరైన టీడీపీ నాయకులు

చిత్తూరు సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో భారీ కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. నగరంలో పలు ప్రాంతాల్లో అభిమానులు అన్నదానం చేశారు. ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, కలికిరి మురళీ మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు సురేంద్ర కుమార్, సప్తగిరి ప్రసాద్, వైవీ రాజేశ్వరి, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, నేతలు చంద్రప్రకాష్, ఎస్పీ జయప్రకాష్, కోదండయాదవ్, విజయ్ కుమార్, మోహన్‌రాజ్, మేషాక్, గోపాల్, త్రిమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నేతలు

యాదమరి: సీఆర్ రాజన్‌కు బీసీ సెల్ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి వినాయకం గౌండర్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు. పూర్ణచంద్రరావు, ఆరణి బాలాజి, పట్టాభి, మనోహర్, మహాదేవ, విశ్వనాథ రెడ్డి, హరి, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజన్‌కు శుభాకాంక్షలు తెలిపిన వినాయకం గౌండర్, టీడీపీ నేతలు

తిరుచానూరులోని స్వగృహంలో..



తిరుచానూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. శనివారం తిరుచానూరులోని ఆయన స్వగృహంలో టీడీపీ నేత దామినేడు రమేష్ ఆధ్వర్యంలో సుమారు 80 కిలోల కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం సీఆర్ రాజన్ దంపతులను గజమాలతో సత్కరించి చిత్రపటాన్ని బహూకరించారు. అంతకుముందు పలువురు రాజకీయ నాయకులు, అభిమానులు ఆయన్ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఓంశక్తి ఆలయంలో చోరీ

నగరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని తెరణిలో ఉన్న ఓంశక్తి ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ గేటు తాళాలను పగులకొట్టి హుండీలోని కానుకలను, అమ్మవారి పూజలకు వినియోగించే హారతి తట్ట, దీపాలు అపహరించుకెళ్లారు.

సీసీలు లేకపోవడంతో స్త్రీశక్తి రుణాలకు బ్రేక్

గుడిపాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గుడిపాల క్లస్టర్‌కు సంబంధించిన వెలుగు సీసీ లేరు. దీంతో స్త్రీ శక్తి రుణాలు పొందడానికి రామభద్రాపురం, కొత్తపల్లె, చుక్కావారిపల్లె, ముట్టుకూరుపల్లె, దాయంవారిపల్లె, అనుప, గాండ్లపల్లెకి సంబంధించి సుమారు 27 డ్వాక్రా గ్రూపుల సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా సీసీని ఏర్పాటు చేయాల్సిందిగా వారు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ద్వాదశి వేడుకలు
గోవింద నామస్మరణతో మార్మోగిన వేణుగోపాలుడి ఆలయం

వెదురుకుప్పం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలో టీటీడీకి అనుబంధంగా ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ద్వాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, తిరుప్పావై నిర్వహించాక భక్తులను దర్శనానికి అనుమతిచ్చారు. స్వామివారిని తిరుచ్చి వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఆవరణంలో కొలువుదీరిన సీతారాముల మూలవర్లకు అభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం గోవింద నామ స్మరణతో మార్మోగాయి. టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్, షరాబ్, బాబుసురేష్, వేదపండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

కలిగిరి సచివాలయంలో సిబ్బంది కొరత

● ఇబ్బంది పడుతున్న జనం

పెనుమూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కలిగిరి సచివాలయంలో వెటర్నరీ, మహిళా పోలీసు ఇద్దరే ఉన్నారు. ఒకరు సెలవు పెట్టినా ఆఫీసులో ఎవరూ అందుబాటులో ఉండటం లేదు. దీంతో సమస్యలతో వస్తున్న ప్రజలు వెనుతిరుగుతున్నారు. పంచాయతీ కార్యదర్శి, అగ్రికల్చర్ అసిస్టెంట్, సర్వేయర్లు లేకపోవడంతో పక్క సచివాలయం సిబ్బందిని ఇన్‌చార్జులుగా నియమించారు. వారికి కూడా వివిధ రకాల సర్వే పనులు ఉండటంతో ఇక్కడకు రాలేకపోతున్నారు. డిజిటల్ అసిస్టెంట్‌ను జీసీ కార్యాలయానికి డిప్యుటేషన్ వేయగా, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మెడికల్ లీవ్, వెల్ఫేర్ వారం రోజులు సెలవు పెట్టడంతో అందుబాటులోలేరు. ఎంఎల్‌హెచ్‌పీలు గ్రామాల్లో ఫీల్డ్ వర్కులకు వెళ్లిపోతున్నారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

ముందస్తు సంక్రాంతి సంబరాలు

చిత్తూరు సెంట్రల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విజయం సైన్స్ అండ్ డిగ్రీ కళాశాలలో అధినేత తేజోమూర్తి, అడకమిక్ డైరెక్టర్ శైలజామూర్తి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుడిపాల: సీఎస్‌ఆర్ కళాశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల నిర్వాహకుడు లోకేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి అర్జున్, విద్యార్థులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం లక్ష్మీనరసింహ విద్యాసంస్థలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. కళాశాల డైరెక్టర్ దిలీప్‌కుమార్, డైరెక్టర్ ధనంజయరెడ్డి, ప్రిన్సిపాల్ కిషోర్, వేణుగోపాల్, శ్రీను, శరవణ, జమున, నరేష్, పద్మనాభం, విద్యార్థులు పాల్గొన్నారు.



విజయం సైన్స్ అండ్ డిగ్రీ కళాశాలలో..



సీఎస్‌ఆర్ కళాశాలలో..



లక్ష్మీనరసింహ విద్యాసంస్థలో..

పాడి రైతులకు చేయూత : ఎమ్మెల్యే థామస్



ఎర్రమరాజుపల్లెలో షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే థామస్

గంగాధరనెల్లూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పాడిరైతులకు అన్నివిధాల చేయూతనివ్వాలని లక్ష్యంతోనే సీఎం చంద్రబాబు.. మినీ గోకులం షెడ్లను మంజూరు చేశారని ఎమ్మెల్యే థామస్ అన్నారు. పాతపాళ్యం పంచాయతీ మిట్టకొత్తూరులో రెండు, మొలకలకండ్రిగలో ఓ గోకులంషెడ్‌ను టీడీపీ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడితో కలిసి శనివారం ప్రారంభించారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలన్నదే కూటమి ప్రభుత్వం ధ్యేయమన్నారు. పాతపాళ్యం సర్పంచ్ కృష్ణమనాయుడు, చిత్తూరు బాలాజి మొబైల్స్ షాప్ యాజమాని యంప్రాల వెంకటేశులునాయుడు, మాజీ ఎంపీటీసీ వరలక్ష్మి, మాజీ సర్పంచ్ లోకనాథ యాదవ్, పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, మండల అధ్యక్షుడు స్వామిదాస్, నేతలు నరసింహులు నాయుడు,సుధాకర్‌నాయుడు, కామసాని కోదండరెడ్డి, నియాజ్ అలీ, నీరజాక్షులురెడ్డి, జీవరత్నం, శాంతకుమార్, శంకర్, సంపత్, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, ఏపీవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాలసముద్రం: తిరుమలరాజుపురంలో గోకులం షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు, నాయకులు వాసునాయుడు, శేఖర్‌రాజు,గుండయ్య, అరుళ్‌నాథన్ క్లస్టర్ ఏపీడీ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి, ఏపీవో మార్గరేట్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: చవనపల్లెలో గోకులం షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీడీవో అమర్‌నాథ్, తహసీల్దార్ రమేష్ బాబు, ఈవోపీఆర్డీ పురుషోత్తం, జనసేన ఇన్‌చార్జి యుగంధర్, టీడీపీ మండల అధ్యక్షుడు లోకనాథం రెడ్డి, మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ఏపీ ఎన్నికల కమిషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ

ఐరాల(కాణిపాకం), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్నికల కమిషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ చక్రవర్తి శుక్రవారం కుటుంబ సమేతంగా కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్ మహేష్‌కుమార్, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



చక్రవర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

సిమెంటు రోడ్డుకు భూమిపూజ

విజయపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇళ్లత్తూరు ఎస్టీ కాలనీలో టీడీపీ సీనియర్ నాయకుడు మునిభాస్కర్‌రాజు సిమెంటు రోడ్డుకు శనివారం భూమిపూజ నిర్వహించారు. ఎన్నికల ప్రచార సమయంలో తమకు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే భానుప్రకాష్ నెరవేర్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వరదరాజులు, ఏకసమళై, చెల్లమరాజు, హరిరాజు, మునికృష్ణమరాజు, వెంకటేసులు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం
ఒకరి అరెస్టు

బైరెడ్డిపల్లె, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తయిండ్లు బస్టాపు వద్ద శనివారం ఉదయం కర్ణాటక మద్యాన్ని అమ్ముతున్న కృష్ణప్పను అరెస్టుచేశారు. అతడి వద్ద నుంచి 50మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు బైరెడ్డిపల్లె పోలీసులు తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలిక అదృశ్యం

పుంగనూరు రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యం కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. పట్టణానికి సమీపంలోని నక్కబండకు చెందిన ఓ బాలిక(16) శనివారం ఉదయం నుంచి కనిపించడం లేదు. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'మినీ గోకులం' పాడి రైతులకు వరం
ఎమ్మెల్యే మురళీమోహన్



తవణంపల్లెలో షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న మినీ గోకులం షెడ్లు పాడి రైతులకు వరమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. వేపనల్లెలో మోహన్‌బాబు, రాగిమానుపెంటలో బాలకృష్ణమనాయుడు నిర్మించుకున్న మినీగోకులం షెడ్లను శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్పీ జయప్రకాష్, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. క్లస్టర్ ఇన్‌చార్జి ధరణీప్రసాద్ నాయుడు, నాయకులు కోకా ప్రకాష్ నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, లోకనాథనాయుడు, జనార్ధన్‌గౌడ్, రమేష్, నాగరాజ నాయుడు, హేమచంద్రనాయుడు, పీడీ రవికుమార్, ఏపీ రవికుమార్, డాక్టర్ ఆసీఫ్, డాక్టర్ మోహన్ బాబు, ఎంపీడీవో శ్రీధర్, ఏపీవో కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లె: మండల కేంద్రంలో మురగేష్‌శెట్టి నిర్మించిన మినీ గోకులం షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గాలి దిలీప్, మాజీ జడ్పీటీసీ వెంకటేష్‌చౌదరి, మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్‌నాయుడు, శవరణ, డీడీ హరీష్, ఏపీడీ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో రెడ్డిబాబు, ఏపీవో లలిత, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

యాదమరి: 184 గొల్లపల్లె గ్రామపంచాయతీ పేరకూరులో గోకులం షెడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం నూరేనగర్‌లో జరిగిన కబడ్డీ పోటీలకు హాజరై కాసేపు సరదాగా ఆడారు. ఎంపీడీవో వేణు, తహసీల్దార్ పార్థసారథి, ఏపీవో బాల, మండల కన్వీనర్ మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, నాయకులు హేమగిరి, వల్లేరు అమరనాథ నాయుడు, గోపి గౌడ్, చిత్రానాయుడు, బెల్లంకొండ కార్తిక్ పాల్గొన్నారు.

మొదటి ముద్దాయి చంద్రబాబే: రోజా

నగరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన భక్తుల తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడం, మరో 54 మందికి తీవ్రగాయాలు కావడంలో మొదటి ముద్దాయి చంద్రబాబేనని మాజీమంత్రి ఆర్కే రోజా ఆరోపించారు. నగరిలోని తన స్వగృహంలో జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. తిరుపతి ఘటనపై బాధ్యతాయుతంగా నడుచుకోవాలని.. అంతేకానీ తప్పుడు సమాచారాలతో పెడదోవ పట్టించడం సమంజసం కాదన్నారు. పవన్ కల్యాణ్ ఏమయ్యారని ప్రశ్నించారు. వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా టీడీ భాస్కర్, కార్యదర్శిగా టీసీ మురగయ్య ఎంపికైనట్లు రోజా తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యాచకురాలి మృతి

పుంగనూరు రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓయాచకురాలు మృతి చెందిన సంఘటన శనివారం పుంగనూరులో ఆలస్యంగా వెలుగుచూసింది. పట్టణంలోని ఆంజనేయస్వామి గుడివీధిలో కుమారమ్మ(65) ఓ ఇంటిని అద్దెకు తీసుకుని భిక్షాటన చేసుకుని జీవనం సాగిస్తుండేది. వారం రోజుల నుంచి కుమారమ్మ బయట కనబడకపోవడం.. ఇంట్లో నుంచి దుర్గంధం వస్తోందని యజమాని రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆమె మృతికి గల కారణాలపై ఆరా తీశారు. మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.